నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | నవంబర్ 27, 2024 | www.navatelangana.com

సర్వేకు రాలేరా..? ఫోన్ చేయండి

- ఫోన్ : 08462-221001 : మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పాలకసంస్థ నిజామాబాద్ పరిధిలో గత రెండు వారాలుగా సామాజిక ఆర్థిక సర్వే కొనసాగుతోంది. ఎన్యూమరేటర్‌లు ఒక వేళ సర్వేకు రాకపోయినా, స్టిక్కర్ అతికించకపోయినా సర్వే చేయకపోయినా 08462-221001 నెంబర్‌కు ఫోన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ పరీక్ష ఫీజు గడువును డిసెంబర్ 3వ తేదీ వరకు ఇంటర్ బోర్డు పరీక్షల విభాగం పొడిగించిందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు, ఎయిడెడ్, అన్ని గురుకుల జూనియర్ కళాశాలలలో ప్రిన్సిపాల్ లు విద్యార్థులు అందరితో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబర్ మూడో తేదీ వరకు ఫీజు చెల్లింపజేయాలని తెలియజేశారు. 100 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 4వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు చెల్లించవచ్చని, 500 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 11వ తేదీ నుండి డిసెంబర్ 17వ తేదీ వరకు చెల్లించవచ్చని, అలాగే వెయ్యి రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు చెల్లించవచ్చని జిల్లా ఇంటర్ విద్య అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు.



నిజామాబాద్‌లో నిరసన ప్రదర్శనలో భాగంగా ర్యాలీ చేపట్టిన నాయకులు

కార్మిక, రైతు, ప్రజల
జీవనోపాధి రక్షించాలి

- ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి
- సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్
- కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన
- నిజామాబాద్‌లో ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ
- కామారెడ్డిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

కార్మిక, రైతు, ప్రజల జీవనపాధిని రక్షించాలని, ప్రభుత్వ రంగ ప్రయివేటీకరణ ఆపాలని నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నాయకులు నిరసన చేపట్టారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐపికెఎంఎస్, ఏఐటీయూసీ, ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు నూర్జహాన్, పి రామకష్ణ, ఓమయ్య, వేల్పూర్ భూమయ్య, వరదయ్య మాట్లాడారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు వెంకట్‌గౌడ్, ఎఫ్‌టియు జిల్లా నాయకులు ప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, ఎఐటియుసి జిల్లా నాయకులు జబ్బార్ మాట్లాడారు.

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నది. కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను తాకట్టు పెడుతున్నది. నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు సాగిలపడుతుంది. మన జాతీయ వనరులు, సంపదను లూటీ చేస్తున్నది. నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా కొనసాగించడానికి 100 రోజుల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అందుకే తమకు ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని మోడీ ప్రభుత్వం చాటుకుంటుంది. లేబర్ కోడ్లను నోటిఫై చేయడం, భారతీయ న్యాయ సంహిత-2023 (బిఎన్ఎస్)ను అమలు చేయడం, నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ ద్వారా కార్పొరేట్, పెట్టుబడిదారుల, బడా వ్యాపారస్తులు ఆర్థిక వెసులుబాట్లకు కల్పించే చర్యలను వేగవంతం చేసింది. పరిపాలనలోకి వచ్చిన 20 రోజుల్లోనే మోడీ నేతత్వంలోని ప్రభుత్వం దేశవ్యాప్తంగా 8 మంది మైనారిటీ మతస్తుల మీద మూకదాడులకు దిగడం ద్వారా ఆర్ఎస్ఎస్, దాని హిందుత్వ మత శక్తులు తమ మత విద్వేష ఎజెండాను అమానుషంగా కొనసాగిస్తున్నది. 2016లో నరేంద్ర మోడీ పార్లమెంట్లో ఇచ్చిన కనీస మద్దతు ధర హామీ నేటికీ అమలు కాలేదు. రైతుల డిమాండ్ ప్రకారం (సి2 ం 50) పంటల పెట్టుబడి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలను పెంచడం లేదు. పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తున్నది. హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయిబాబాను 10 సంవత్సరాలు జైలులో నిర్బంధించి ఆయన మరణానికి మోడీ సర్కార్ నిర్బంద చర్యలే కారణమయ్యాయని యావత్ దేశమే కోడైకూసింది.



కామారెడ్డిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టిన నాయకులు

స్కీమ్ వర్కర్ను కార్మికులుగా గుర్తించ లేదు. ఉద్యోగ భద్రత కల్పించ లేదు. అసంఘటితరంగ కార్మికుల సంక్షేమం గాలి కొదిలేసింది. గ్రామీణ ఉపాధి హామీలో విపరీతంగా కోతలు విధించింది. వలస కార్మికులను రోడ్లపాలుచేసింది. అనేక త్యాగాలు, రక్త తర్పణతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మారుస్తూ పార్లమెంట్లో ఎలాంటి చర్చ జరగకుండా ఏకపక్షంగా బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. కార్మికవర్గానికి గుదిబండలుగా మారుతున్నాయి. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానాన్ని తుంగలో తొక్కింది. ఇప్పటికైనా కేంద్ర తన విధానాలు మార్చుకోవాలని, లేకుంటే ప్రజాఉద్యమాలు ఉధృతం చేసి గద్దె దింపుతామని' హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షవర్గంగా ఎస్కేయం, కార్మిక సంఘాల నాయకులు వెంకటేష్, ఏ రాజేశ్వర్ సూర్య శివాజీ,ఎం నరేందర్, బి గంగారెడ్డి వ్యవహరించారు. నిరసన కార్యక్రమానికి కమ్యూనిస్టు వామపక్ష పార్టీల జిల్లా కార్యదర్శులు రమేష్ బాబు, కంజర భూమన్న వి. కష్ణ, ఆకుల పాపయ్య సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఏ ఐ టి యు సి జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ రావు, ఎస్కేయం,కార్మిక సంఘాల నాయకులు బి దేవరామ్ ఏం ముత్యన్న,ఎన్ దాసు,శివకుమార్ కే గంగాధర్ బి మల్లేష్,రాజేశ్వర్,జి కిషన్ కటారి రాములు స్వర్ణ సుకన్య పసియోద్దీన్ లిఫ్ట్ ఇరిగేషన్ నాయకులు సాయ గౌడ్,పి రాజేశ్వర్, అశోక్, జాతీయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) మరియు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో నిర్వహించిన నిరసనలో రైతు కూలి సంఘం జిల్లా నాయకులు నర్సింలు, రాజనర్సు, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు నర్సింలు, రోజా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగస్ఫూర్తిని అలవర్చుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ అంకిత్
- భారత రాజ్యాంగం చాలా గొప్పది
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి
- ఘనంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం వేడుకలు
- అలరించిన ఒగ్గు కథ.. విజేతలకు బహుమతులు ప్రదానం



విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేత

నవతెలంగాణ -కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

యువత రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిజామాబాద్ ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి పద్మావతితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించి భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మన రాజ్యాంగం ప్రతీ పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలు రూపొందించిందన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రపంచంలోని అనేక దేశాల్లో పర్యటించి రూపొందించిన రాజ్యాంగంలో కులమతాలకు అతీతంగా ప్రజలకు సమాన హక్కులను కల్పించారన్నారు. రాజ్యాంగం ప్రకారం దేశంలోని ప్రతి పౌరుడికి కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంత, లింగ భేదాలు లేకుండా సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందడంతో పాటు తమ విధులను, బాధ్యతలను తెలుసుకొని దేశ అభివద్ధికి పాటుపడాలని సూచించారు. మనందరం సంతోషంగా జీవిస్తున్నామంటే అది రాజ్యాంగ చలవే అన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సమీకత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతిజ్ఞ చేశారు. జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు సమక్షంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. 'భారతదేశ ప్రజలమైన మేము దేశ సార్వభౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యముగా నెలకొల్పుటకు, పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ, న్యాయమును, భావము, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధన - వీటి స్వాతంత్ర్యమును, అంతస్తులోనూ, అవకాశంలోనూ సమానత్వాన్ని చేకూర్చుటకు, అందరిలోనూ వ్యక్తి గౌరవమును, జాతి ఐక్యతను, అఖండతను కాపాడేందుకు అంకిత భావంతో కషి చేస్తామని' ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతిజ్ఞ చేయడానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు
కాపాడాల్సిన బాధ్యత అందరిది

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-నిజాంసాగర్/లింగంపేట్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రపంచవ్యాప్తంగా అత్యంత గొప్పదిగా గుర్తింపు పొందిన రాజ్యాంగం మనదని, దాని మౌలిక లక్ష్యాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జవహర్ లాల్ నవోదయ విద్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత రాజ్యాంగం గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని విద్యార్థి దశ నుండి రాజ్యాంగం గురించి అవగాహన కలిగి ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో సమగ్ర సర్వే డాటా ఎంట్రీ ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీపతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, తాహసిల్దార్ బిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, విద్యాలయ ప్రిన్సిపల్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు త్వరగా తరలించాలని ట్యాబ్ ఎంట్రీ త్వరగా చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మండలంలోని వెలగనూరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా వెలుగనూరు గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లకు కలెక్టర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా సహకార అధికారి రాం మోహన్, జిల్లా పౌరసరఫరాల అధికారి నరసింహారావు, తాహసిల్దార్ బిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పోటీపడాలి

లింగంపేట్ : మహిళా సంఘాల సభ్యులు వ్యాపార రంగంలో అన్ని రంగాలలో పురుషులతో పోటీపడి రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం లింగంపేట్ ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సమావేశంలో పాల్గొన్నారు. అంతకుముందు 36 వేల రూపాయలతో నిర్మించనున్న రూఫ్ టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి సురేందర్, మండల మహిళా అధ్యక్షురాలు జి.సులోచన ఎంపీడీఓ నరేష్, తహసీల్దార్ నరేందర్, ఐకేపీ ఏపిఎం శ్రీనివాస్ మండల సమైక్య అధ్యక్షురాలు సులోచన ఎం పి ఓ మల్లారి సిబ్బంది పాల్గొన్నారు.

తీరిన నీటికష్టాలు

- నవతెలంగాణ కథనానికి స్పందన..
- ట్యాంక్‌కు బోర్‌మోటార్ అనుసంధానం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



ట్యాంక్ నుంచి వస్తున్న నీరు

మండలం లోని చవునితండాలో వారం రోజుల నుండి తాగునీటి కష్టాలు అనే శీర్షికన నవతెలంగాణలో కథనం ప్రచురితమైన విష యం విధితమే. గ్రామస్తులు నీటి కోసం పడుతున్న ఇక్కట్లను ప్రస్తావిస్తూ కథనం ప్రచురించడంతో పంచాయతీ కార్యదర్శి సాయిబాబా స్పందించారు. బోరు మోటర్ నీటిని ట్యాంకుకు అనుసంధానం చేశారు. దీంతో ట్యాంక్‌కు నీరు చేరి గ్రామస్తులకు ఇక్కట్లు తీరాయి.

29న దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఈనెల 29 శుక్రవారం న కామారెడ్డి జిల్లా కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే దీక్ష దివస్‌ను నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన జిల్లా బిఆర్ఎస్ పార్టీ సమావేశానికి ఆయన సభ పరిశీలకులుగా కామారెడ్డికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్ష దివాసును ఘనంగా జరపాలని బిఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో చేపట్టిన దీక్ష ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈ విషయాన్ని ప్రతి ఒక్క కార్యకర్త ఈ సమావేశానికి రాకపోయినా ఎక్కడ ఉన్నా అక్కడ ఈ దీక్ష దివాసును జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజుల సురేందర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యంకె ముజీబోద్దిన్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

లక్ష కుటుంబాల డాటా ఎంట్రీ పూర్తి

- నెలాఖరు వరకు మొత్తం పూర్తిచేస్తాం
- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నవతెలంగాణ-ధర్పల్లి



డాటా ఎంట్రీని పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్

అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం కొనసాగుతోందని, ఈ నెలాఖరు వరకు ఆన్లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇప్పటి వరకు లక్ష కుటుంబాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు తెలిపారు. మంగళ వారం ధర్పల్లి తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాల యాల్లో కొనసాగుతున్న ఆన్లైన్ నమోదు ప్రక్రియను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్లైన్లో వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించి, వారికి పలు సూచన లు చేశారు. సమాచార గోప్యతను పాటించాలని, ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఇంటింటి సర్వే వివరాలను ఒక్కో కుటుంబం వారీగా జాగ్రత్తగా ఆన్లైన్లో ఎంట్రీ చేయాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా తనను కలిసిన విలేఖరులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి సర్వే 99 శాతం పూర్తయిందన్నారు. సర్వే సందర్భంగా సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వేగవంతంగా నమోదు చేయిస్తున్నామని, ఇప్పటికే లక్ష పైచిలుకు గహాలకు సంబంధించిన వివరాల నమోదు పూర్తయ్యిందని వివరించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ధర్పల్లి ఎంపీడీఓ బాలకష్ణ, తహశీల్దార్ మాలతి తదితరులు ఉన్నారు.

భోజనం కలుషితం కాకుండా చూడండి

ప్రభుత్వ సంక్షేమ వసతి గహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం, అల్పాహారం కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. భోజనం వండడానికి ముందే ప్రతీ రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యతా లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని ఆదేశించారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ధర్పల్లి మండలం రామడుగు ప్రాజెక్టు గ్రామంలో ఐడీసీఎంఎస్, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను గమనించి ధాన్యం సేకరణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తరలించిన ధాన్యం నాణ్యతను, తేమ శాతాన్ని మాయిశ్చర్ మీటర్ ద్వారా పరిశీలించారు. కేంద్రం వద్ద ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను ప్రశ్నించగా, ఎలాంటి సమస్యలు లేవని తెలిపారు. క్రమ పద్ధతిలో ధాన్యం కాంటా పెడుతున్నారని, వెంటదివెంట ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని కలెక్టర్ దష్టికి తెచ్చారు. ఇప్పటికే ధాన్యం విక్రయించిన రైతులకు కనీస మద్దతు ధరతో పాటు, బోనస్ డబ్బులు కూడా ఖాతాలలో జమ అయ్యాయని తెలిపారు. కాగా, సరిపడా గన్నీ బ్యాగులను సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీల కొరత, లారీల కొరత తలెత్తకుండా చూసుకోవాలని కేంద్రాల నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపుల కోసం ధాన్యం సేకరణ పూర్తయిన వెంటనే టాబ్ ఎంట్రీలు జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ధర్పల్లి ఎంపీడీఓ బాలకష్ణ, తహశీల్దార్ మాలతి తదితరులు ఉన్నారు.



స్కూల్లో వండిన అన్నం పరిశీలిస్తున్న కలెక్టర్

కనీస విద్యార్హతలు లేకుండా చికిత్సలు

- తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందాల తనిఖీ.. కేసు నమోదు
- విచ్చలవిడిగా యాంటీబయాటిక్ ఇంజక్షన్లు ఇస్తున్నట్టు గుర్తింపు





వెంకటసాయి, భారతి క్లినిక్‌లను తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-బాన్సువాడ

కనీస విద్యార్హతలు లేకుండానే పలువురు క్లినిక్‌ల పేరుతో ప్రజలకు వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్ డా శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ బండారి రాజ్ కుమార్ తెలిపారు. వీరి ఆధ్వర్యంలో యాంటీక్వేకరి బృందం మంగళవారం నిజామాబాద్ , బాన్సువాడ లోని పలు నకిలీ వైద్యుల క్లినిక్లపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నకిలీ డిగ్రీ డీబీఎంఎస్ పేరుతో సమీర్ రాయ్ ప్రియాంక క్లినిక్, జుగ్రాయ్ దేవిక రాయ్ భారతి క్లినిక్ పేర్లతో కనీస విద్య అర్హత లేకుండా ఆధునిక వైద్యం చేస్తూ విచ్చలవిడిగా యాంటీబయాటిక్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు పైల్స్ కి ట్రీట్మెంట్ ఇస్తున్నట్టు గుర్తించారు. వీరి వద్ద హేతు బద్ధత లేకుండా రోగులకు ఇచ్చిన యాంటీబయాటిక్ ఇంజక్షన్లు వందల సంఖ్యలలో బయటపడ్డాయి. మొత్తంగా 30 సెంటర్ లపై తనిఖీ లు నిర్వహించగా 15 మంది నకిలీ వైద్యులు పట్టుబడ్డారు. వీరిపై ఎన్ ఎం సి చట్టం 34, 54 ప్రకారం కేసు నమోదు చేయనున్నామని, ఈ చట్టం ప్రకారం ఏడాది జైలు శిక్ష తో పాటు 5 లక్షల వరకు జరిమానా విధిస్తారని డా శ్రీనివాస్ తెలిపారు. నకిలీ వైద్యుల క్లినిక్ లకు అనుభందంగా ఉన్న మెడికల్ స్టోర్స్‌లో సైతం క్వాలిఫైడ్ డాక్టరు ప్రెస్క్రిప్షన్ లేకుండా, ఫార్మసిస్ట్ లు లేకుండా యాంటీ బయోటిక్, స్టెరాయిడ్, ఇతర షెడ్యూల్ డ్రగ్స్ విక్రయిస్తినట్టు గుర్తించామని సంబంధిత రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ లపై డ్రగ్ కంట్రోల్ అథారిటీ తో పాటు ఫార్మసీ కౌన్సిల్ కి ఫిర్యాదు చేయనున్నట్లు సభ్యులు డా బి.రాజ్ కుమార్ తెలిపారు. తనిఖీల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డా విష్ణు, కో ఆప్ట్ సభ్యులు డా విజయ్ కుమార్ పాల్గొన్నారు.



జాతీయస్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్‌కి బ్లూమింగ్ బడ్స్ విద్యార్థిని


విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇటీవల మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచిన బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వై.ప్రజ్ఞ జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. విద్యార్థి ఎంపిక కావడం ఆనందంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ ప్రసన్నకుమారి అభినందించారు. జాతీయ స్థాయి పోటీలు డిసెంబర్ 6 నుంచి 10 వరకు జమ్మూ కాశ్మీర్ లో జరగనున్నాయి. ఈ సందర్భంగా బోధన్ ఎంఎల్‌ఏ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, విద్యార్థినిని అభినందించారు.

అడిషనల్ డీసీపీ (అడ్మిన్) గా బస్వరెడ్డి నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ అడిషనల్ డీసీపీ(అడ్మిన్)గా బస్వారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న కోటేశ్వర్‌రావు ఎల్బీ నగర్ శాంతిభద్రతల అదనపు డీసీపీగా బదిలీ అయ్యారు. కాగా ఆర్మూర్లో ఏసీపీగా పని చేస్తున్న సమయంలో బస్వారెడ్డికి ఏఎస్పీగా పదోన్నతి లభించింది. అనంతరం ఆయనను తాత్కాలిక బాధ్యతల్లో నిజామాబాద్ కమిషనరేట్ శాంతిభద్రతల అదనపు డీసీపీగా కొనసాగించారు. తాజా బదిలీల్లో ఆయనకు అదనపు డీసీపీ(అడ్మిన్)గా పోస్టింగ్ ఇచ్చారు.

ఎన్నికల హామీలను కచ్చితంగా నెరవేరుస్తాం

- తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల

నవతెలంగాణ-బాల్కొండ


మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలకేంద్రానికి చెందిన నానం నరేష్‌కు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహకారంతో 3 లక్షల రూపాయలతో మంజూరైన పౌల్ట్రీ ఫామ్, కిసాన్ నగర్ గ్రామంలో జక్కా మేఘనకు 95వేల వ్యయంతో మంజూరైన పశువులపామ్ పనులను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి కాబోతున్న సందర్భంగా ఈ సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలిపే విధంగా విజయోత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విజయోత్సవాలను రాజ్యాంగం రచించబడిన దినోత్సవం నాడు ప్రారంభించడం వెనుక ఈ దేశంలో రాజ్యాంగ విలువలను కాపాడు కోవ డంకోసం రాజ్యాంగం ఇచ్చిన హక్కుల్ని అందరికి సమానంగా అందాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రారం భించడం జరిగిం దని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్ఛిన్నమైన తెలంగాణ ఒక్కొక్కటిగా మళ్లీ పునర్నిర్మిస్తు ఒక్కొక్క కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. ప్రతిపక్షాలు రెచ్చగొడితే వారి మాటలను నమ్మవద్దని అన్నారు. ఆలస్యమైన కానీ ఖచ్చితంగా ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేరుస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపు 50 వేల ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. కుల గణన అనే కార్యక్రమం ఒక సాహసోపేతమైందని, ఈ దేశంలోనే ఒక మైలురాయి అని తెలిపారు. కుల గణనపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీధర్, ఏపీవో ఇందిరా, పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్ రెడ్డి, రేణుక దేవి, వేల్పూర్ సొసైటీ డైరెక్టర్లు జక్క రాజేశ్వర్, ఇమ్రాన్, సౌమ్య, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు సంజీవ్ గౌడ్, కనికారపు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తౌటు గంగాధర్, ప్రవీణ్ గౌడ్, విద్యాసాగర్, చేని నాగేష్, రియాజ్, రవీందర్ గౌడ్, పురుషోత్తం, బండి మల్లేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు


అథ్లెటిక్స్‌కు ఎంపికైన గురుకుల విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న నాగారంలోని రాజారామ్ మైదానంలో నిర్వహించిన 12వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో సాంఘిక సంక్షేమ విద్యార్థులు ఆద్య, అఖిలేష్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పూర్ణచందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ - 8 విభాగంలో 300 మీటర్లు, కె. నవతేజ్ సిల్వర్ మెడల్, అండర్ 12లో జావలిన్ త్రోలో ఆద్య గోల్డ్ మెడల్, అండర్ 12లో 400 మీటర్స్‌లో బి.అఖిలేష్ గోల్డ్ మెడల్, ఆద్య సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నారని వైస్ ప్రిన్సిపల్ సాయన్న, దయాల్ చక్రపాణి తెలిపారు. సాంఘిక సంక్షేమ విద్యార్థులు నవతేజ, అఖిలేష్, ఆద్య, అక్షిత్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి పాఠశాల, కళాశాలకు అండర్-12 కేటగిరీలో ఓవరాల్ ఛాంపియన్షిప్‌గా నిలిపారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం గంగాధర్, రవి, రాజు, నరేష్, గణేష్, రాజేశ్వర్, షీలా రాణి, ప్రేమ్, వ్యాయామ ఉపాధ్యాయులు పిడి బి.జ్ఞానేశ్వర్. పిఈటి కె.రాజేందర్, కోచ్ నరేష్, కళాశాల, పాఠశాల బృందం, నాన్ టీచింగ్ స్టాఫ్ లక్ష్మణ్, సూపర్డెంట్ లక్ష్మి విద్యార్థులను అభినందించారు .

మురికి కాలువలో చెత్త తొలగింపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

మండల కేంద్రంలోని కాలనీలో పలు చోట్ల మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. మురికి కాలువలోని చెత్తాచెదారాన్ని ఎత్తి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించారు. కాగా 63వ నంబర్ జాతీయ రహదారి పక్కనే కళ్యాణి ఫోటో స్టూడియో సమీపంలో ఉన్న మురికి కాలువలో చెత్త తొలగింపు పంచాయతీ కార్మికులకు ఇబ్బందికరంగా మారుతుంది. ఇక్కడ రెండు వైపుల నుండి మురికి నీరు ఒక చోట చేరి అక్కడినుండి జాతీయ రహదారి కింద ప్రవహిస్తుంది. అయితే మురికి కాలువల్లో ప్రజలు వేసే ప్లాస్టిక్ కాగితాలు, ప్లాస్టిక్ బాటిల్లు, ఇతరత్రా వస్తువులు మురికి నీటి ప్రవాహంలో కొట్టుకు వచ్చి కళ్యాణి ఫోటో స్టూడియో సమీపంలో ఉన్న మురికి కాలువల వద్ద పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. ఇలా పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్న ప్రజలు నిత్యం మురికి కాలువల్లో వేసే చెత్త మూలంగా ప్రయోజనం లేకుండా పోతుంది. ప్రజలు చెత్తాచెదారాన్ని మురికి కాలువల్లో కాకుండా ఇంట్లోనే నిల్వ ఉంచుకొని గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేస్తే బాగుంటుందని పంచాయతీ సిబ్బంది పేర్కొంటున్నారు.

పేరిణి నాట్యం నృత్య ప్రదర్శన


నృత్యంలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో మంగళవారం కార్తిక దీపోత్సవ సందర్భంగా శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళస్తీశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీకాళహస్తిలో సిద్ధార్థ కళాక్షేత్ర విద్యార్థినులతో పేరిణి నాట్యం నృత్య ప్రదర్శన చేశారు. విద్యార్థినులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ నగరానికి చెందిన విద్యార్థినులు పాల్గొని నృత్య ప్రదర్శన చేశారు.

చేపూర్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ జాతీయ రహదారి 44 రోడ్‌పైన సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే ఒకరు మృతి చెందినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ మంగళవారం తెలిపారు. చనిపోయిన వ్యక్తి 50 నుండి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని, గుర్తు తెలియని వాహనం డికొట్టి వెళ్లి పోగా ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. శవం ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉంచినట్లు, ఎవరైనా సదరు వ్యక్తిని గుర్తు పడితే 8712659858, 9440140022 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలి సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పద్మశాలి సంక్షేమ సేవ సమితి అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పలు తర్పల అధ్యక్షులు వంగా వివేక్, నూకల నారాయణ, బండి అనంత రావు, రుద్ర రాజేశ్వర్, సదమస్తుల గణపతి, మామిడిపల్లి 2వ తర్ప మాజీ అధ్యక్షులు ఏడేల్లి శ్రీనివాస్, అందే నాగేశ్వర్ ,యెలిగేటి విఠల్, వేముల లింగోజీ, సురుకుట్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలకు రోడ్డు వేయిస్తాం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో పంట పొలాలకు వెళ్లే రహదారులను కొత్తగా వేయిస్తామని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాపూనగర్, ఎమ్మెస్సీ ఫారంలో పంటపొలాలకు వెళ్లే రోడ్లు మరమ్మతులు చేయిస్తానని అన్నారు. మారుమూల గ్రామాల్లో మట్టి రోడ్డు పనులను పది సంవత్సరాలుగా పాలకులు పట్టించుకోకపోవడంతో పంట పొలాలకు వెళ్లే రహదారులు పూర్తిగా చెడిపోయాయని అన్నారు. పనులు నాణ్యతగా ఉండాలని అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది నుండి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. బోధన్ ప్రాంతంలో చెరుకు పంట పండించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. కాగాఎడపల్లి తాసిల్దార్ ధన్వల్ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, మధ్యాహ్నం 12 గంటల తర్వాత కార్యాలయానికి వస్తున్నారని జానకంపేట, నెహ్రూ నగర్, ఎడపల్లి గ్రామాలకు చెందిన రైతులు గంట పాటు కార్యాలయంలో కూర్చొని భూముల సెటిల్మెంట్లకు వెళ్ళిపోతున్నాడని, చరవాణి ద్వారా సమాచారం అడిగితే అక్కడ ఉన్న.. ఇక్కడ ఉన్న అంటూ తప్పించుకుంటున్నాడని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్బిన్ హుందాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు బిల్లా రామ్మోహన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరంటీ లింగం, మాజీ సర్పంచులు ఎల్లయ్య యాదవ్, పాల్దా భాస్కర్ రెడ్డి, సాయికుమర్, బషీర్, బాలా గౌడ్ తదితరులుఉన్నారు.

చలో పార్లమెంట్‌కు ఏఐపిఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

యువజన, కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 28న నిర్వహించే చలో పార్లమెంట్ కార్యక్రమానికి ఏఐపీఎస్‌యు నిజామాబాద్ జిల్లా నాయకులు మంగళవారం ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బోడ.అనిల్ మాట్లాడుతూ...విద్యా, ఉపాధి, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడం, ప్రజా వ్యతిరేక విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్య రంగాన్ని కాపాడుకోవాలంటే కొఠారి కమిషన్ ప్రకారం మొత్తం కేంద్ర బడ్జెట్లో విద్య రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని కానీ ప్రతి ఏటా 2-3శాతం కంటే ఎక్కువ కేటాయించడం లేదని అన్నారు. కార్పొరేట్ వ్యక్తులకు విద్యారంగాన్ని ధారాదత్తం చేసేందుకే ఈ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. వెంటనే నూతన జాతీయ విద్యా విధానం 2020 ను రద్దు చేయాలని, చరిత్రను వక్రీకరిస్తూ చేస్తున్న ఎన్సీఈఆర్ సిలబస్ మార్పులను ఆపాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిధులను తగ్గించి నిర్వీర్యం చేసే కుట్రను మానుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్ లో కోతలు విరమించుకోవాలని, విద్యా కాషాయీకరణ కుట్రను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి. సాయికుమార్, నగర కార్యదర్శి సందీప్, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ సింగ్ ఠాకూర్, ఆనంద్ శివ రాజు స్వామి తదితరులు చలో ఢిల్లీకి బయలుదేరారు.

ఆముగ్గురిని కాంగ్రెస్ పార్టీ నుండి వెంటనే సస్పెండ్ చేయాలి

- మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు బరికుంట శ్రీనివాస్ మాదిగ

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు

సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనమైన ఏబిసిడి వర్గీకరణను అడ్డుకోవడానికి, డిసెంబర్ 1న నిర్వహించే వర్గీకరణ వ్యతిరేక మాలల సింహగర్జన సభను జి.వివేక్ వెంకటస్వామి, మల్లు రవి, కె ఆర్. నాగరాజు లాంటి రాజకీయ మధ్య వర్తులు మాలలను రెచ్చగొడుతూ మాల మాదిగల మధ్య వైశ్యామ్యాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. వర్గీకరణకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీ విధానాలను వ్యతిరేకిస్తున్న వీరిని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యలలో భాగంగా పార్టీ నుండి సస్పెండ్ చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు బరికుంట శ్రీనివాస్ మాదిగ అన్నారు. మంగళవారం నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా ఆగస్టు 1న ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీ సాక్షిగా దేశంలో మొదట వర్గీకరణ చేసే రాష్ట్రంగా తెలంగాణలో వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పారన్నారు. 2024 ఎలక్షన్ మేనిఫెస్టోలో మొదటి అంశంగా వర్గీకరణను చేర్చి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే చేతుల మీదుగా చేవెళ్ల డిక్లరేషన్‌లో వర్గీకరణ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసి కూడా ఈ ముగ్గురు కేవలం వారి వ్యక్తిగత రాజకీయ లబ్ది కోసమే మాల మాదిగల, మధ్య వైశ్యామ్యాలు రెచ్చగొడుతున్నారన్నారు. కావున వీరిని కాంగ్రెస్ పార్టీనుండి సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా నాయకులు మల్లాని శివ మాదిగ, గైక్వాడ్ గంగాధర్, రాజు, జైశ్వంత్, మహిళా నాయకురాలు బైకాడి లత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి శైలజ మృతి ప్రభుత్వ హత్య

- హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి
- లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చౌహాన్ మోహన్ నాయక్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గిరిజన విద్యార్థి శైలజ మృతిపై హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరపాలని శైలజ మృతి రాష్ట్ర ప్రభుత్వ హత్యగా లం బాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ భావిస్తున్నదని నిజామాబాద్ జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు చౌహాన్ మోహన్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థి శైలజ మృతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని, కొమరం భీం జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గిరి జన విద్యార్థి శైలజ మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనబడుతుందని అన్నారు. గత నెల 30న వాంకిడి ఆశ్రమ పాఠశాలలో భోజనం తిని 60 మంది విద్యార్థులు అస్వతతకు గురి కావడం చూస్తూ ఉంటే హాస్టళ్లపై ప్రభుత్వ నియ ంత్రణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ విద్యార్థి మృతికి బాధ్య త వహిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్


మానవహారం నిర్వహిస్తున్న న్యాయవాదులు

నిజామాబాద్ న్యాయవాది ఖాసింపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఘటన పైన చర్చించారు. అనంతరం కోర్టు చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో ల్యాండ్ మాఫియా పెరిగిపోయిందని, శాంతి భద్రతలకు విఘాతం జరుగుతుందని, గుండాగిరి రాజ్యం ఏలుతుందని, దీనిని అరికట్టి శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు. న్యాయవాది ఖాసింపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసే వరకు ఆందోళన కార్యక్రమాన్ని విరమించేది లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆందోళనకు స్పందించిన అడిషనల్ డిసిపి బసవరెడ్డి జిల్లా కోర్టు వద్దకు వచ్చి న్యాయవాదులతో మాట్లాడి దాడి కేసులో హత్యాయత్నం సెక్షన్‌లో కోర్టులో మెమో దాఖలు చేశామని, అరెస్టుకు బృందాలను ఏర్పాటు చేశామని, కచ్చితంగా అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ మెంబర్ రాజేందర్‌రెడ్డి, వసంతరావు, రాజు, సురేష్, పిల్లి శ్రీకాంత్, అయూబ్, పరుచూరి శ్రీధర్, భాస్కర్, పి. వెంకటేష్, మాణిక్, ఆశ నారాయణ, రాజు, రవీందర్, విగ్నేష్, జైపాల్, ఆశ నారాయణ, జునేద్, ఇర్ఫాన్, జిషంత్, ఇంతియాజ్, ఖలీద్, కవిత రెడ్డి, అంజలి, కావ్య, అఖిల, ప్రవీణ, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన క్రిస్మస్ వేడుకలు


ముస్కుభూమేశ్వర్‌ను సన్మానిస్తున్న క్రైస్తవులు

నవతెలంగాణ-ముప్కాల్

క్రిస్టమస్ వేడుకలను మంగళవారం మండలకేంద్రంలోని చర్చిలో మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన క్రైస్తవ సోదరులు ఘనంగా సన్మానించారు. అనంతరం చర్చి పాస్టర్ మాట్లాడుతూ.. నెల రోజుల వరకు వేడుకలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 25న క్రిస్టమస్ వేడుకలు ఘనంగా చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముప్కాల్ చర్చి పాస్టర్, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నాగంపేట్ గ్రామంలో మంగళవారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బాధిత లబ్ధిదారుల కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు అయిన చెక్కులను ఇంటింటికి వెళ్లి అందజేసినట్టు పార్టీ నాయకులు దాసరి గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి గంగాధర్, నాయకులు పల్లపు గంగాధర్, బదనపల్లి సురేష్, దాసరి నరేష్, దాసరి చిన్న నర్సయ్య, అడిగే సచిన్ తదితరులు ఉన్నారు..

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మండల కేంద్రంలోని అల్ప సంఖ్యాక గురుకుల పాఠశాలను మండల అభివృద్ధి అధికారి గణేష్ జాదవ్, సూప రింటెండెంట్ శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 40శాతం మెస్ చార్జీలను పెంచడంతో విద్యార్థులకు అందించే పౌష్టిక ఆహారాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలతో పాటు, గురుకుల పాఠశాలలను వారు తనిఖీ చేశారు. ఈ పాఠశాల్లో విద్యార్థుల హాజరు పట్టికలతో పాటు, సిబ్బంది వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం వంట గదులను పరిశీలించడంతోపాటు, స్టాకు వివరాలను ఆయన తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్యా బోధనతోపాటు పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ హర్షియా నాజంకు ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, బాలికలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని వారు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి జూనియర్ మహిళ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టుకు శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 29 నుండి డిసెంబర్ 1, వరకు పట్టణంలో జరగబోయే 46వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ మహిళా హ్యాండ్ బాల్ క్రీడా పోటీలలో పాల్గొనబోయే ఉమ్మడి జిల్లా జట్టుకు శిక్షణ శిబిరం జాయిద్‌బాయ్ మినీ స్టేడియంలో కొనసాగుతుంది. ఈ శిక్షణ శిబిరాన్ని నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, జిల్లా హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షులు గంగామోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజా సురేందర్, కోశాధికారి ఘట్టడి రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేష్, రమణ, శ్యామ్, నరేందర్, సునీత, మాధురి, సంతోష్ ఠాకూర్, చిన్నయ్య, నాగేష్, సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు రాహుల్, సాయి పాల్గొన్నారు.

ఈనెల 29 నుండి..

ఈనెల 29, వచ్చేనెల 1వ తేదీలో జరగబోయే 46వ జూనియర్ గర్ల్స్ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్షిప్ 2024 పోటీలకు గ్రౌండ్ ఏర్పాట్లను జిల్లా హ్యాండ్ బాగ్ సంఘం అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి గట్టడి రాజేష్ పర్యవేక్షించారు.

డ్రోన్‌తో తక్కువ ఖర్చుతో మందుల పిచికారి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

డ్రోన్ సహాయంతో పంట పొలాల్లో మందులను పిచికారి చేస్తే డబ్బులతో పాటు సమయం ఆదా అవుతుందని ఏవో సాయికిరణ్ తెలిపారు. మంగళవారం నాగిరెడ్డిపేట్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు డ్రోన్‌పై అవగాహన కల్పించారు. మందులు తక్కువ మోతాదులో ఖర్చు అవుతాయన, అదేవిధంగా రైతులకు డబ్బులు ఆదా అవుతాయని తెలిపారు. ప్రతి మంగళవారం డ్రోన్ వాడకంపై రైతు నేస్తం కార్యక్రమం రైతు వేదికలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏడిఏ రత్నం ఏఎంసీ డైరెక్టర్ నాగేశ్వర్, ఏఈవోలు రవికుమార్ దివ్య ప్రశాంత్ బి టి యం షఫీ మరియు రైతులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమానికి హాజరైన రైతులు

ఉపాధి హామీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని కరెక్ వాడి గ్రామంలో ప్రజా పాలన వారోత్సవాల్లో భాగంగా కరక్ వాడి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉమ్మాజీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, ఐకెపి సిసి భూమయ్య ఏఎస్ఎం శివ నీల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులు ప్రారంభించిన్న గ్రామస్తులు

వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

- తనిఖీ చేసిన అధికారులు

విలేకరుల-బృందం


నిజాంసాగర్: పాఠశాలను తనిఖీ చేస్తున్న డిఎవో


పిట్లంలో..


లింగంపేట్‌లో..

నాగిరెడ్డిపేట్: నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాల, ఎస్సీ వసతి గృహలను మంగళవారం మండల స్పెషల్ అధికారి ఏ డి ఏ రత్నంతో పాటు తహసీల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో ప్రభాకర్ చారి వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని వారు పరిశీలించారు అదేవిధంగా వసతిగృహాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహ ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ప్రిన్సిపల్ గీత కోరారు. అదేవిధంగా ఎస్సీ హాస్టల్లో బెంచీలు కావాలని సంబంధిత అధికారులకు వార్డెన్ రాములు కోరారు. వసతి గృహాల్లో వసతులపై అధికారులు ఆరా తీశారు. సంబంధిత రిపోర్టులను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు ఉన్నతమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు అధికారులు ఆదేశించారు. నాణ్యత లోపం లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు అధికారులు ఆదేశించారు.

పిట్లం: వసతి గృహాలలో విద్యార్థులు ఎక్కువగా గైర్హాజర్ అవుతున్నట్లు మండల తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహముతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహమును తనిఖీ చేశారు. మాట్లాడుతూ వసతి గృహాలలో విద్యార్థులు ఎక్కువ శాతం డుమ్మా, గైరాజరుగుతున్నట్లు తమ తనిఖీ లో వెల్లడైనట్లు ఆయన తెలిపారు. జిల్లా అధికారులు ఇచ్చిన నమూనాలో తనిఖీ చేసిన నివేదికను జతచేసి సిల్ కవర్‌లో నివేదించనున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, భారత రాజ్యాంగం విశిష్టతను వివరిస్తూ సిబ్బంది ప్రతిజ్ఞ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ ఐ శీతల్, వసతి గృహాల వార్డర్లు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం స్కూల్ ఎడ్యుకేషన్ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఆదర్శ పాఠశాల స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల తో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పై, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నార అని వారు విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అందరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు సూచించారు. పాఠశాలలోని వివిధ రికార్డులను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. అనంతరం ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల విద్యాధికారులు తిరుపతిరెడ్డి, అమర్ సింగ్, పాఠశాల ప్రిన్సిపల్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి రాజారాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. నిత్యం భోజనం రుచి ఎలా ఉంటుందని ఉదయం సాయంత్రం అల్పాహారం ఇచ్చే విషయం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చల్లటి గాలి వీస్తాయని అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కస్తూర్బా పాఠశాల ను పరిశీలించారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీ ఓ సవిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని ఉప్పల్‌వాయి ఎస్సీ, రామారెడ్డిలోని కస్తూర్బా, ఎస్సీ హాస్టల్లో, ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల, రామారెడ్డి బాలుర, బాలికల, మండల పరిషత్ పాఠశాలలోని మధ్యాహ్నం భోజనం, వంట గదులన, ఆహర నాణ్యతను మంగళవారం కామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు సురేష్ పరిశీలించారు. ఆయా పాఠశాలలో అనారోగ్యానికి గురైన విద్యార్థులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది భీం, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలో ఎస్సీ వసతి గృహలను మంగళవారం రోజు మండల తహసీల్దార్ దశరథ్ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని వారు పరిశీలించారు అదేవిధంగా వసతిగృహాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వం ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని మంగళవారం నాడు ఎల్లారెడ్డి తహసిల్దార్ మహేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, హాస్టల్ పరిసరాలను, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని సూచించారు. మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆర్డీవో మన్నే ప్రభాకర్‌తో కలిసి నూతన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్: విద్యార్థినిలకు పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా డిఆర్డిఏ పిడి సురేందర్ ప్రిన్సిపాల్ కు సూచించారు. మంగళవారం లింగంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం పాఠశాలలో మంటగధులను పరిశీలించారు స్టోర్ రూమును పరిశీలించారు. అనంతరం పిల్లలతో కూర్చుండి భోజనం చేశారు ఈయన వెంట మండల విద్యాధికారి షౌకత్ అలీ ప్రిన్సిపల్ వాసంతి ఉపాధ్యాయురాన్లు ఉన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-గాంధారి

గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. గాంధారి మండలంలోని నాగ్లుర్ గ్రామంలో సూర్యచంద్ర నాటకం ప్రదర్శన సందర్భంగా సోమవారం రాత్ర గంజాయి, మత్తు పాదార్థాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రాణహాని జరుగుతుందని గంజాయి లాంటిమత్తు పదార్థాలకు బానిసలు కావద్దని మీ కుటుంబాన్ని మీరే రోడ్డున పడేయవద్దని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అందరు ఐకమత్యంగా ఎలాంటి గొడవలు లేకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు బలరాం,సతీష్ ,ఉపసర్పంచ్ రవి, సాయిలు, పంతులు,సంగమేశ్వర్,రామగౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

నవతెలంగాణ-కామారెడ్డి

దేవునిపల్లి పరిధిలో జూనియర్ కళాశాలలో మంగళవారం కళాబృందం షి టీం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీటీం, సైబర్ క్రైమ్, ఏ హెచ్ టి యుపై అవగాహన కల్పించారు. షీ టీం నెం. 8712686094, సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి వినియోగించుకోవలేనని చెబుతూ, అత్యవసర పరిస్థితులలో టోల్ ఫ్రీ నెంబర్ 100, 108, 1930, 181 ల విలువలు తెలిపారు. ప్రతి మహిళ ఫోన్ నందు టి - సేఫ్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలనీ ఇది మహిళలకు చాలా అత్యవసరమైనదన్నారు. ఈ కార్యక్రమానికి పి ఎస్ సిబ్బంది ఏఎస్ఐ, కళాబృందం సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల పాక నిర్మాణం ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని ఐదు గ్రామాల్లో పశువుల పాకల నిర్మాణానికి పనులు ప్రారంభించినట్లు ఏపీవో సాయిలు తెలిపారు. ఎస్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా ఈ నిర్మాణాలు ప్రారంభించినట్లు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 10 పశువుల పాక నిర్మాణాలు చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం రోజు మండలంలోని జాన్యంపల్లి, అక్కంపల్లి , మాల్ తుమ్మెద, మాటూర్, పల్లె పోగడ తాండ గ్రామాలలో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నిర్మాణానికి ఎస్ఆర్ఈజీఎస్ ద్వారా ఒక్కోనిర్మాణానికి 92 వేల రూపాయలు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఏపీఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ నుంచి వేములవాడకు ఎక్స్ ప్రెస్ బస్ ప్రారంభం

నవతెలంగాణ-పిట్లం

డివిజన్ కేంద్రమైన బాన్సువాడ డిపో నుండి వేములవాడ వాడకు నేటి నుండి ఎక్స్ ప్రెస్ బస్‌ను నడపనున్నట్లు డిపో మేనేజర్ సరితా దేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్తీక మాసం పురస్కరించుకొని వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లే భక్తుల నిమిత్తం బాన్సువాడ డిపో నుండి 7 గంటల 30 నిమిషాలకు వయా గాంధారి, కామారెడ్డి , సిరిసిల్ల మీదుగా నేటి నుండి ఈనెల 30 తేదీ వరకు ఎక్స్ ప్రెస్ బస్సు కొనసాగనున్నట్లు ఆమె తెలిపారు. ఇట్టి సదవకాశాన్ని డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన భక్తాదులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

రూ.2.5 లక్షల ఎల్‌వోసీ చెక్కు అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ గ్రామానికి చెందిన గోనెల నరసింహులు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ ఠాగూర్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్రావు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే చికిత్స కొరకు రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మంజూరు చేసిన చెక్కును ఉపాధ్యక్షుడు ఠాగూర్ బాధితులకు అందజేశాడు.

విద్యుత్ బిల్లు వసూలుకు స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ట్రాన్స్కో ఏఈ కర్ణాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో బకాయి ఉన్న విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాలరాజ్, రమేష్, రాజ్ కుమార్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

స్కూల్‌లో యూత్ అసెంబ్లీ నిర్వహణ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూత్ అసెంబ్లీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గాంధారి ఉన్నత పాఠశాలలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని యూత్ అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సాంఘిక శాస్త్ర బోధకులు రమేష్ , బాల్ రెడ్డి, శ్రీనివాస్ మార్గదర్శకంలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు అద్భుతంగా అసెంబ్లీని తలపించేలా ప్రతిభను కనబరిచారు. అసెంబ్లీ సమావేశం ప్రారంభం , సభను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం, క్వశ్చన్ అవర్ ,జీరో అవర్ బిల్లులు ప్రవేశపెట్టడం, ఆమోదించే ప్రక్రియను చక్కగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ విక్టర్ భారత రాజ్యాంగ విశిష్టతను, ఓటు హక్కు విలువ, ప్రభుత్వ విధివిధానాల రూపకల్పన గురించి తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో యూత్ అసెంబ్లీ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమని, స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరంగా వెంకటేశ్వర్ గౌడ్ సాంఘిక శాస్త్రం బోధకులు రమేష్, మండల విద్యాశాఖాధికారి శ్రీహరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగా వెంకటేశ్వర్ గౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న దగ్ధం

నవతెలంగాణ-తాడ్వాయి


మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమై రూ. 30,000 ఆస్తి నష్టం వాటినట్టు గ్రామస్తులు తెలిపారు. దేనికలాన్ శివారులో గైన చంద్రం కు చెందిన రెండు మొక్కజొన్న కాలిపోయినట్టు తెలిపారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పి వేశా యని తెలిపారు.

ప్రతీ పది నిమిషాలకు ఒక్కరిపై హింస

నవతెలంగాణ-సదాశివనగర్

అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్త్రీ లపై బాలికలపై జరుగుతున్న హింసను ఎదుర్కొండి అనే నినాదంతో 15 రోజుల కార్యక్రమాలలో భాగంగా సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇన్స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్ మెంట్ (ఐ.యస్.ఆర్.డి) స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఐ.ఎస్.ఆర్.డి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సోలంకి రవళి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఇంకా మహిళలపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతీ పదినిమిషాలకు ఒక్కరిపై హింస జరుగుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పై హింసలు, దాడులు జరిగితే 181 కు కాల్ చేసి రక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అజ్మల్ ఖాన్, ఐ.ఎస్.ఆర్.డి స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి విఠల్ రావు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా 11 రకాల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఈ సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టి బోర్డు బాధ్యతలు నుండి వైదొలగాలని ప్రయత్నం చేయడం సరైనది కాదని మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం నాయకులు అబ్దుల్ రజాక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద మరణం, సహజ మరణం,పాక్షిక అంగవైకల్యం, శాశ్వతంగా వైకల్యం తదితర సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టు పెడితే కార్మికులకు తీవ్రమైన సమస్య ఎదురవుతుందని, ఇది పూర్తిగా కార్మిక రంగానికి అన్యాయం చేయడమే అవుతుందని మండిపడ్డారు. సంక్షేమ బోర్డు ఏర్పడింది కార్మికుల రక్షణ కోసమేనని, సంక్షేమ నిధులను ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టి వారికి లాభాలు పెంచడం కోసం కాదని విమర్శించారు. ప్రభుత్వమే సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే కార్మికులంతా ఏకమై ఉద్యమ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

డాటా ఎంట్రీలో తప్పులు రానీయొద్దు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ గాంధారి మండల కేంద్రంలోని వివిధప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేపట్టారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం మండల పరిషత్ కార్యాలయం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సోషల్ ఎకనామిక్ సర్వే డాటా ఎంట్రీ కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోషల్ ఎకనామిక్ సర్వే డాటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి డిసిఎంఎస్ డైరెక్టర్ సాయికుమార్, తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్,డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. వంద రోజులు పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలను సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి చంద్ర నాయక్ ఏఎంసీ చైర్మన్ సంగ్య నాయక్ ఎంపీడీవో సంతోష్ కుమార్ ఎంపీఓ సురెందర్ రెడ్డి టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ బిగింపు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో కాలనీవాసులకు తాగునీటి సరఫరా చేసే బోరు మోటర్ కాలిపోయిందని మంగళవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన నూతన బోరు మోటర్, స్టార్టర్ లను గంటల వ్యవధిలోనే ఏర్పాటు చేయించి యధావిధిగా కాలనీవాసులకు తాగునీటి సరఫర చేయించారు. సత్వరమే సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట 12వ వార్డు కౌన్సిలర్ నీలకంఠం, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎడ్ల కిషన్,తిరుపతి, పోచయ్య,శ్రీనివాస్, వెంకటి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని ఆత్మకూరు గ్రామంలో మంగళవారం రోజు సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఎల్లారెడ్డి ఏఎంసి డైరెక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు సిసి రోడ్డు నిర్మాణం కోసం ఎస్ డి ఎఫ్ ద్వారా నాలుగు లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో మసీదు గల్లీలో సిసి రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సుభాన్ రెడ్డి, వసంత్ రెడ్డి, ఆబేద్ పాషా, ఫరూక్ , అబ్దుల్ నయం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల కబడ్డీ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-గాంధారి

68వ రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 19 బాలికల కబడ్డీ పోటీలకు గాంధారి మండల్ గౌరారం కలన్ గ్రామానికి చెందిన పి.శృతి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. కామారెడ్డి జిల్లా లోని జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ టీమ్ కి సెలక్ట్ అయినట్టు తెలిపారు. నెల 24 నుంచి రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్‌లో జరిగిన పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించినట్టు తెలిపారు.

పోలీసు కార్యాలయంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం


ఎల్లారెడ్డి: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న నాయకులు


దోమకొండ లో..


కామారెడ్డిలో..


రామారెడ్డి లో...

విలేకరుల-బృందం

కామారెడ్డి: 75వ భారత రాజ్యాంగ దినోత్సవన్ని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయం లో అదనపు ఎస్పీ (అడ్మిన్) కే నరసింహారెడ్డి అధికారులు సిబ్బంధితో కలిసి ఘనంగా నిర్వహించరు. ఈ కార్యాక్రమం లో ఏ ఓ, రిజర్వు ఇన్స్పెక్టర్స్ నవీన్ కుమార్, కృష్ణ, ఎ.ఆర్ సిబ్బంది, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఎమ్మెల్యే నివాలి

భారత రాజ్యాంగానికి ఆమోదం తెలిపి నేటికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కామారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో రాజ్యాంగానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలో అన్నింటి కన్నా ప్రాముఖ్యమైనదనీ 75ఏళ్లు గడిచినా ఇంకా పాలన ప్రజాస్వామ్య యుతంగా జరుగుతుంది అంటే రాజ్యాంగ గొప్పతనం అని అన్నారు. నేటి తరం ప్రతి పౌరునికి రాజ్యాంగం గురించి పూర్తిగా అవగాహన ఉండాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్ లు నరేందర్, శ్రీనివాస్, నాయకులు భరత్, సురేష్, ఈశ్వర్, వేణు, వెంకట్ రెడ్డి,రాజేష్ పాల్గొన్నారు.

సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక కామారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు తుమ్మ రామచంద్రం, ఇందూర్ విభాగ్ సహ సంయోజకులు బాల్ రాజ్ గౌడ్, జిల్లా అధ్యక్షులు అమృత రాజేందర్, కృష్ణ మూర్తి, బాలకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, భూపాల్, నర్సింలు పాల్గొన్నారు.

గర్గుల్ జడ్పీహెచ్ఎస్‌లో భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవ సందర్భంగా గర్గుల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నమూనా ఎన్నికల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. ఎల్లయ్య ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేశారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్ తెలిపారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ప్రారంభోత్సవం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే దేశంలో అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛ జీవితాలు గడుపుతున్నారని కుల మత ప్రాంతీయ వేదాలు లేకుండా ఒకటిగా కలిసి ఉంటూ జాతి సమైక్యతను కాపాడుతున్నారని అన్నారు. రాజనీతి శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు వీరేశమును సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష్, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంగన్న, సంతోష్, మల్లేష్, హారిక, లక్ష్మి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మంగళవారం ఢిల్లీలో జరిగిన 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నట్లు తాడ్వాయి మండలం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివాజీ తెలిపారు. ఈ దినోత్సవం లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగర్తి ప్రీతం పాల్గొని మాట్లాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దెల భాగయ్య తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

దోమకొండ: దోమకొండ మండల కేంద్రం లోని ప్రజా పాలన, రాజ్యాంగ దినోత్సవం,సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, అధికారులు, గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం చేసి ప్రతిజ్ఞ మంగళవారం చేశారు. ఈ కార్యక్రమం లో ఏపీవో రజని, ఈవో యాదగిరి, నాయకులు, సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డి: 75వ భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని పట్టణ కేంద్రంలో దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎం.ఎస్.పి.పార్టీ నాయకులు కంతి పద్మారావు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో జీవరాశులన్నిటికీ రక్షణ కల్పిస్తూ లిఖించారని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, వంటి అనేక విలువలు రాజ్యాంగంలో అంతర్భాగంగా ఉన్నాయని తెలిపారు. ఇంత గొప్ప రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. కార్యక్ర మంలో తెలంగాణ యువజన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు టి ఎస్ రమేష్, జగ్గా కృష్ణ, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్, నరేష్, రాజు, శివనందం తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: ప్రజా పరిపాలన, 75 వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ గ్రామాలతో పాటు పాఠశాలలో కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధి హామీలో భాగంగా ఉద్యానవన డ్రాగన్ ఫ్రూట్స్ తోటలను ప్రారంభించారు. ప్రత్యేక అధికారి గురుకుల, ఎంపీడీవో ఎస్సీ హాస్టలను తనిఖీ చేశారు. ఉపాధి హామీలో ఎక్కువ పని దినాలు చేసిన కూలీలకు, గ్రామ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, ఏపిఎం ప్రసన్నకుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేపర్ బ్యాలెట్ విధానం ప్రవేశపెట్టాలని దాఖలైన వాజ్యం కొట్టివేసిన సుప్రీంకోర్టు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని పున్హ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిఎం ట్యాంపరింగ్ పై పిటిషనర్ డాక్టర్ కౌల్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని పేర్కొన్నారు. పిటిషన్ ను తిరస్కరించిన సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసిందని, ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవిఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తిచూపిందని తెలిపారు. పిటిషనర్ వాదనల్లో ఎలాంటి మెరిట్‌ను కనుగొనలేదని, ఎన్నికల్లో ఈవీఎంల వ్యవస్థతో రాజకీయ పార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పిబి వరాలేలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టర్ తెలిపారు.

గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ

నవతెలంగాణ-మాక్లూర్


భూమిపూజ చేస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి

మండలంలోని మండాపూర్ నూతన గ్రామ పంచాయతీ భవనానికి ఆర్మూర్ కాంగ్రెస్ నియోజక వర్గ ఇంఛార్జి పి. వినయ్ కుమార్‌రెడ్డి భూమి పూజా మంగళవారం చేశారు. ఎన్‌ఆర్‌ఇజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు గ్రామాల్లో బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి ప్రకాష్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, సొసైటీ చైర్మన్ బి. అశోక్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డా. కిరణ్ దేశ్ పాండే, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆరు ట్రాక్టర్ల ఇసుక పట్టివేత

- అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం..
- రేంజ్ అధికారి రవి మోహన్ భట్


ట్రాక్టర్లను పటుకున్న ఫారెస్ట్ రేంజ్ అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అటవీ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఇందల్ వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్ అన్నారు. మంగళవారం ఇందల్ వాయి రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేంజ్ పరిదిలోని ఓన్నాజి పేట్ హాన్నాజిపేట్ సెక్షన్, కోటాల్ పల్లి సెక్షన్ బీట్ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ లో ఆక్రమంగా ప్రవేశించి ట్రాక్టర్లతో ఇసుకను తరలించేందుకు ప్రయత్నించిన ఆరు ట్రాక్టర్లను ఫారెస్ట్ అధికారులు పట్టుకొని ఇందల్ వాయి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.. పట్టుకున్న ట్రాక్టర్లకు సీజ్ చేసి ఉన్నతాధికారులకు నివేదించామని, వారి ఆదేశానుసారం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. దాడిలో సెక్షన్ అధికారి జి. భాస్కర్, బీట్ అధికారులు రాములు, వంశిరాజ్, ప్రవీణ్, దిలీప్, పోషన్న, బేస్ క్యాంప్ సిబ్బంది గణేష్, ప్రణయ్, విలాస్, ప్రవీణ్, ప్రణయ్, మహేష్, తదితరులు ఉన్నారు.

ముగిసిన భీమన్న ఉత్సవాలు

- అన్నదాన సత్రం


ఉత్సవాల్లో పాల్గొన్న ఆదివాసీ నాయకపోడు సంఘం సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం (2వ పంథా) ఆధ్వర్యంలో భీమన్న ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా చేపట్టినట్లు సంఘం అధ్యక్షుడు కంచు శ్రవణ్ తెలిపారు. ముఖ్య అతిగా ఆదివాసీ నాయక పోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షులు గాండ్ల రామచందర్ వచ్చారని చెప్పారు. కార్యదర్శి గంగాసాయన్న ఉద్యోగస్తుల కార్యదర్శి కోసిడగు రవి, కొండ్రు నవీన్ పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, ఆయా కుల సంఘాల ప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపరిరక్షణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు..

పశువుల కొట్టం నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-మెండోర


భూమిపూజ నిర్వహించిన ప్రత్యేక అధికారి

మండలంలోని చాకిర్యాల్ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో పశువుల కొట్టం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి.ముత్యం రెడ్డి అధికారులతో కలిసి టెంకాయ కొట్టి భూమి పూజలు చేసి పశువుల కొట్టం నిర్మాణం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలి

- యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి


మాట్లాడుతున్న మానాలమోహన్‌రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సామ జైడి నర్సారెడ్డికి మంజూరైన గేదెల షెడ్డుకు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజెపి, బీఆర్ఎస్ నాయకులు వారం రోజులుగా రైతులను తప్పుదోవ పట్టేలా అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. దీంతో భయానికి గురైన రైతులు ఆందోళనతో ప్రైవేటు వ్యక్తులకు వారి వడ్లను అమ్ముకున్నారన్నారు. ఈ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారో టిఆర్ఎస్, బిజెపి నాయకులు చెప్పాలని ప్రశ్నించారు. వారి మాటలు నమ్మవద్దని, ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, ముప్కాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, సొసైటీ అధ్యక్షులు జాక్క రాజేశ్వర్, ఎంపీవో గౌస్ మొహినోద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందా రవి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం సాగర్, రాజ్ కుమార్, మహేష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చిట్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలి

- పాత పెన్షన్ పద్ధతిని కొనసాగించాలి
- లేబర్ కోడ్ లను రద్దు చేయాలి
- ఎల్ఐసి ఉద్యోగ సంఘం డిమాండ్

నవతెలంగాణ-బోధన్

బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం విధించిన 18 శాతం జీఎస్టీని వెంటనే ఉపసంహరించాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ సంస్థ అయిన ఐసిఇయు సంఘం ఎల్ఐసి ఉద్యోగ సంఘం నాయకుడు నరసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం ఎదుట విరామ సమయంలో ఎల్ఐసి ఉద్యోగ సంఘ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జీవిత బీమా, ఆరోగ్య భీమా, సాధారణ భీమాలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఉపాధి హామీ కూలీలకు కూలి దినాలు పెంచాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను రైతుల కనీస మద్దతు ధరకు ప్రభుత్వం సమకూర్చే విధంగా కృషి చేయాలన్నారు. 1996లో ఉన్న పెన్షన్ విధానాన్ని అలాగే కొనసాగించాలన్నారు. లేబర్ కోడ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులకు సంపూర్ణ నిరసన తెలిపే హక్కు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీమా రంగాన్ని


నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

మరింత శక్తివంతం చేస్తే జిడిపిలో ప్రీమియం వాటా పెరుగు తుందని సూచించారు. బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న 18 శాతం జిఎస్టిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మందికిపైగా పార్లమెంట్ సభ్యులను, పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజేష్ కుమార్, లియాపి సంఘ నాయకులు, ఎల్ఐసి ఉద్యోగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షదివస్ ప్రజల బ్రహ్మాస్త్రం

- ఆయన పదేళ్ళ పాలన ఒక స్వర్ణ యుగం
- పోవాలి కాంగ్రెస్.. మళ్లీ రావాలి కేసీఆర్
- మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేపట్టిన కేసీఆర్ దీక్షదివస్ చారిత్రక ఘట్టం ప్రజల చేతిలో తిరుగులేని బ్రహ్మాస్త్రం దీక్షా దివస్ అని నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఈనెల 29న చేపట్టనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించిన నేత కేసీఆర్ అని అభివర్ణించారు. నాడు తెలంగాణ ద్రోహులను తరిమికొట్టింది ఈ బ్రహ్మాస్త్రమే. నేడు మళ్లీ చిట్టినాయుడి ముసుగులో ఉన్న ద్రోహులను తరిమికొట్టేది ఈ బ్రహ్మాస్త్రమే అని అన్నారు. నాడు తెలంగాణ సాధనలో కేసీఆర్ దీక్షా దివస్ చెరగని సంతకమయితే..నేడు రేవంత్ రెడ్డిది అంతులేని అవినీతి సంతకమన్నారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను భుజానికెత్తుకొని ఏప్రిల్ 27, 2001 నాడు గులాబీ జెండాను ఎగరవేసిన కేసీఆర్ స్వరాష్ట్ర సాధనకు కర్మ, కర్త, క్రియ అని అభివర్ణించారు. కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో నవంబర్ 29, 2009 న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిందన్నారు. అవే


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నిర్బంధాలు, అవే అణచివేతలు, అవే దుర్భర పరిస్థితుల నేపథ్యం కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కనిపిస్తున్నాయన్నారు. ఆనాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ దీక్షా దివస్ స్ఫూర్తితో నేడు మళ్లీ రెండు జాతీయ పార్టీల మెడలు వంచాల్సిన పరిస్థితి తెలంగాణ ప్రజలపై ఉన్నదన్నారు. సమావేశంలో మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్దన్, జీవన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ వి.జి గౌడ్, మాజీ జడ్పి చైర్మన్ విఠల్ రావు, సీనియర్ నాయకులు రాజారాం యాదవ్, రాంకిషన్ రావు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసిఆర్ ఏడు లక్షల కోట్ల అప్పు చేశాడు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బీఆర్ఎస్ సాధినేత 7 లక్షల కోట్ల అప్పు చేశాడని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంగళవారం అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి తొర్లి కొండ పుప్పాలపల్లి గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పుప్పాలపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి కెసిఆర్ ఏడు లక్షల కోట్ల అప్పు చేశాడని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లలో నాలుగు విడతల్లో 110 ఇండ్లు మంజూరు చేస్తారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో నేను ప్రచారం కు వచ్చినప్పుడు గ్రామాన్ని దత్తత తీసుకుంటానని తెలిపానని అన్నారు. పుప్పాలపల్లి వెనుకబడిన గ్రామమైన మండలంలో కెల్లా అధిక బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ ఐడిసిఎంఎస్ చైర్మన్ మునిపెల్లి సాయి రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు, కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్, బ్రాహ్మణ పల్లి సింగిల్ విండో చైర్మన్ కాట్పల్లి నర్సారెడ్డి, ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కనుక రవి, అబ్బీర్ అబీర్ సింగ్ తదితర నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే

రాబోయే ఎలక్షన్లలో యువకులకు పెద్ద మొత్తంలో కేటగిరి వారిగా టికెట్లు ఇవ్వాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేను కోరినట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ తెలిపారు. పుప్పలపల్లి గ్రామంలో పలు అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాలకు వచ్చిన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క యువజన నాయకుడికి నేను ఉన్నానంటూ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ నాయకులు గన్న లక్ష్మణ్, రాజేష్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఉత్కం శ్రీనివాస్ గౌడ్, మునూర్ ప్రణయ్, జనరల్ సెక్రెటరీ అభి సాయి, మైనార్టీ అధ్యక్షులు సైకిల్ టెక్స్ అక్బర్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఎమ్మెల్యేను సన్మానించిన గ్రామ మహిళా సంఘాలు

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేను పుప్పాలపల్లి గ్రామ మహిళా సంఘాలు శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా వచ్చిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పుప్పాలపల్లి గ్రామంలో సన్మానించారు. మహిళా గ్రామసంఘం భవన ప్రవాహరి గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మహిళా గ్రామ సంఘం అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు కార్యదర్శి కోశాధికారి సహాయ కార్యదర్శి వివోఏ కవిత మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధించడం అభినందనీయం

- జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన యువతికి సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధించడం అభినందనీయం అని చైర్మన్ రాజ రెడ్డి అన్నారు. మోర్తాడ్ మండలం దోన్ పాల్ గ్రామానికి చెందిన పర్స అనుష రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించడం తో మంగళవారం గ్రంథాలయ చైర్మన్ అంత రెడ్డి రాజ రెడ్డి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజ రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడ అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. నిరుద్యోగులు, ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యే వారికి అవసరమైన పుస్తకాలు, చైర్లు, దాతల సహకారంతో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కలెక్టర్ గ్రంథాలయం సౌకర్యాల కోసం చొరవ చూపడం, సానుకూలంగా స్పందించారని అన్నారు. మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజక వర్గాల గ్రంథాలయాల ఫర్నిచర్, రిపేర్ ల కోసం ఎనిమిది


సన్మానిస్తున్న చైర్మన్

లక్షలు ప్రోసిడింగ్ ఇచ్చారని, ఇందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా అనుష మాట్లాడుతూ. జిల్లా గ్రంథాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు చదువుకునే అవకాశం ఉండటంతో ఉద్యోగం సంపాదించే అవకాశం సులువు అయ్యిందని అన్నారు. ప్రిపేర్ అయ్యే వారికి సదుపాయాలు కల్పించడంతో ఎక్కువ మంది ఇక్కడ ప్రిపేర్ అవ్వడానికి ముందుకు వస్తున్నారనికార్యదర్శి బుగ్గ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ రాజారెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరేష్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్, శ్రీనివాస్, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గుండారంలో మధ్యాహ్నం భోజనం తనిఖీ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గుండారం లోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని నిజామాబాద్ రూరల్ మండలం ఎమ్మార్వో అనురోద్ మంగళవారం తనిఖీ చేశారు.


మధాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎమ్మార్వో

నడ్పల్లిలో ప్రజా పాలన విజయోత్సవాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి మేజర్ గ్రామపంచాయతీలో గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్ రావు ఆధ్వర్యంలో మంగళశారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

ఓటర్ లిస్టులో మార్పులు, చేర్పులపై సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులపై ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అధ్యక్షతన అన్ని పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా అన్ని పార్టీల నాయకులు సూచనలు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కోరినట్లు వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, నాయకులు ఊట్నూరి ప్రదీప్, బిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు కొత్తపల్లి రఘు, బిజెపి మండల నాయకులు ప్రవీణ్, సిపిఐ(ఎంఎన్) మాస్ లైన్ ప్రజా ప్రంథా నాయకులు సారా సురేష్, మండల పంచాయతీ అధికారి సదానంద్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: ఓటరు జాబితాలోని మార్పులు చేర్పులపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ నాయకులతో ఎంపీడీవో గణేష్ జాదవ్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సప్లమెంటరీ ఓటర్ జాబితాలోని చేర్పులు మార్పులపై వారితో చర్చించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్ హైమద్, ప్రధాన రాజకీయ పార్టీ నాయకులు కాంగ్రెస్, భాజపా, టిఆర్ఎస్, సిపిఐ ఎంఎల్ ప్రజా పంత, నాయకులు గైని సాయిలు, గోపికృష్ణ, వడ్డన్న, తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాష్' పరీక్షపై శిక్షణ

నవతెలంగాణ-మోపాల్

ప్రకాష్ 2024 పరీక్షకు సంబంధించిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిజామాబాద్ జిల్లా డైట్, బీఈడీ ట్రైనింగ్ విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన మెళకులు తెలిపేందుకు ట్రైనింగ్ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోర్గాం(పి) లో మంగళశారం నిర్వహించారు. డైట్ కళాశాల, బీఈడీ కళాశాల విద్యార్థులు ఫీల్డ్ ఇన్విజిలేటర్‌గా శిక్షణ పొందారు. డిసెంబర్ 4న రాష్ట్రవ్యాప్తంగా ప్రకాష్ 2024 పరీక్ష జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, ప్రధానోపాధ్యాయులు శంకర్, క్వాలిటీ కోఆర్డినేటర్ జీవన్ సీతయ్య, డీసిబి సెక్రెటరీ, శ్రీనివాస్ డైట్ ప్రిన్సిపల్, సాంకేతిక శిక్షకుడు లక్ష్మీనాథం పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో మంగళవారం ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలన్న ఉద్దేశంతో అధికారులు ఫార్మేషన్ రోడ్లకు శ్రీకారం చుట్టారు. బాగేపల్లి, కూనేపల్లి గ్రామాల్లో గ్రామ ప్రత్యేక అధికారి హెచ్. శ్రీనివాస్ ప్రారంభించగా, మండల కేంద్రంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ పీ ఓ రమణ, టిఏ దేవిసింగ్, గ్రామ కార్యదర్శులు శ్రీకాంత్, శివకృష్ణ, రాజేందర్ రావు, క్షేత్ర సహాయకులు గోపి, యాదగిరి, మధు, ఉల్లి శోభన్, కాంగ్రెస్ నాయకులు సురేందర్ గౌడ్, సగ్గు వెంకటి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, ఇందిరా దేవి, ఆసాని వేణు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వైద్యం, విద్యాభివృద్దే లక్ష్యం

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నవీపేట్


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి వైద్య విద్యాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని మోకన్ పల్లి గ్రామంలో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా 85.50 లక్షల నిధులతో కస్తూర్బా బాలికల పాఠశాల అదనపు గదుల నిర్మాణం, భవన మరమ్మత్తులకు, మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, కమలాపూర్‌లో ఫార్మేషన్ రోడ్డు నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాలల్లో తరగతులను పెంచిన భవనాలు నిర్మించకుండా వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అందుకు మౌలిక వసతులతో పాటు భవన నిర్మాణాలను చేపడుతున్నామని కస్తూర్బా పాఠశాలలో అన్ని సౌకర్యాలతో భవనాన్ని నిర్మించడంతో పాటు పాత భవనానికి మరమ్మత్తులు చేపడుతున్నామని అన్నారు. విద్యార్థులు చేసిన కళా ప్రదర్శన ఎంతగానో అలరించగా విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రికి 10 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ప్రహరీ గోడ నిర్మిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలను పరిశీలించి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంధాలయ చైర్మన్ రాజారెడ్డి, నగేష్ రెడ్డి,డీఈఓ అశోక్ ,డిప్యూటీ డిఎంహెచ్వో అంజన, ఎమ్మార్వో వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిని కవిత, మాజీ ఎంపీపీ రాజేందర్ కుమార్ గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం, పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం

- రైతులకు బోనస్, ఆస్పత్రికి స్థల కేటాయింపు పట్ల హర్షం



నవతెలంగాణ-వర్ని(చందూర్)

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ధాన్యం క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ ఇవ్వటంతో మంగళవారం చందూర్ సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్ ఆధ్వర్యంలో సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి చిత్ర పటాలకు ప్రజా ప్రతినిధులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి మాట్లాడుతూ.. బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితో మండలానికి 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయటంతో హర్షం వ్యక్తం చేస్తున్నామని, ఆసుపత్రికి స్థలాన్ని ముప్పని చంద్రవతి చందూర్ శివారులో అర ఎకరం ఇవ్వటంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయేలా అయన కృషి ఉందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మూడ్ అంబర్ సింగ్, సీఈఓ భూమయ్య, కరెంగా సాయిలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్ బాల్ శిక్షణ శిబిరానికి సత్యశోధక్ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-సిరికొండ



ఈ నెల 28 నుంచి 2 వరకు కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులోని 'ది డాన్ బోస్కో ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో జరిగే జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్ బాల్ శిక్షణ శిబిరానికి సత్యశోధక్ పాఠశాలనుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. జూన్‌లో బెంగుళూరులో జరిగిన జాతీయ మేజర్ లీగ్ బేస్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డి. శ్రీకాంత్, యస్. స్నేహిత్, కే. అజయ్ శిక్షణ శిబిరంలో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాలల సింహా గర్జన గోడప్రతుల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్



డిసెంబర్ 1న హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహాగర్జన సభకు తరలిరావాలని కోరుతూ మంగళవారం సాలూర మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సభకు మాల సోదరులు అధిక సంఖ్యలో హాజరయి సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు సాలెన్ రాజేందర్, గ్రామ అధ్యక్షులు రాహుల్ లక్ష్మణ్, కార్యదర్శి సరిడే యాదు, గైనీ అనీల్, మహిళ సంఘం నాయకురాలు రాజమణి, సంఘం నాయకులు పాల్గొన్నారు.



కోటగిరిలో..



ఏర్గట్లలో..



వర్నిలో..

రాజ్యాంగంవల్లే అన్నివర్గాలకు న్యాయం

- పేదలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు
- రాజ్యాంగ నిర్మాతకు నివాళ్లు

75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పలు పాఠశాలలు, కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించారు. . అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. రాజ్యాంగంవల్లే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని తెలిపారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం



కంఠేశ్వర్ : పోలీసుల అధ్వర్యంలో..

కంఠేశ్వర్ :పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డిసిపి (అడ్మిన్) కోటేశ్వర రావు, అదనపు డిసిపి (లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డి, అదనపు డిసిపి (ఎఆర్) శంకర్ నాయక్ భారత రాజ్యాంగ ప్రవేశిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫోటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు డిప్యూటి కమిషనర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ ప్రవేశిక గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నాగయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, బషీర్, వనజరాణి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సతీష్ కుమార్, తిరుపతి, శ్రీనివాస్, శ్రీపాల్, శేఖర్, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోమ్ గార్డ్సు సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మొదట అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లు అర్పించారు. రాజ్యాంగంలోని పీఠిక చదివి వినిపించారు. రాజ్యాంగంవల్లే అన్ని వర్గాల హక్కులకు రక్షణ కలుగుతుందని తెలిపారు. దేశం అభివృద్ధి దిశలో వెళ్ళడానికి భారత రాజ్యాంగం పాత్ర ఎంతో ఘనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ మున్సిపల్ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోపాల్ :మోపాల్ గ్రామపంచాయతీ ఆవరణలో రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేశారు. గ్రామసభ లో జాతీయ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు, ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాష్ట్ర పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్ అధ్యక్షుడు పి.మధుసూదన్ రెడ్డి ప్రత్యేక అధికారి, బి రాములు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ రవికుమార్, మాజీ వార్డ్ మెంబర్స్, తదితరులు పాల్గొన్నారు. బోర్గం పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శంకర్ మాట్లాడుతూ భారత దేశ పౌరులు రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాస్ వివరించారు. ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి అనంతరం రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

బాల్కొండ :మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రజియుద్దీన్ అస్లం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడు భారతదేశ రాజ్యాంగాన్ని కాపాడవలసిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్:సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగ రాజ్యాంగ నిర్మాతడా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.విద్యార్థులచే భారత రాజ్యాంగ పీఠికను తెలుగు,ఆంగ్లంలో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఎంఈఓ రాజీమంజుషా మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో పాలుపంచుకున్న మహనీయుల కృషిని కొనియాడారు. రాజ్యాంగం రచించడానికి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు సమయం పట్టిందని 1949 26 నవంబర్ భారత రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని సమర్పించింది భారత రాజ్యాంగ పరిషత్ 25 జనవరి 1950 నా భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 26 జనవరి 1950 నుండి అమలులోకి వచ్చిందని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముప్కాల్ లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి..



మోపాల్ లో..



బోధన్: పెంటకుర్దులో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న పలువురు

బోధన్ మండలం పెంటాఖుర్దు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామస్థులంతా కలిసి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కోర్వ శ్రీనివాస్, క్యాషియర్ గైని గంగాధర్, కుంటి రాములు, కోర్వ గోపి, బ్యాగరి రమేష్, ప్రవీణ్, సుమన్, ఆనంద్, గ్రామ పెద్దలు శివ సాయి పటేల్ , లక్ష్మణ్ పటేల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్ , రిటైర్డ్ ఎంఈఓ శంకర్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి :వేల్పూర్ మండలంలోని మోతే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో ప్రార్థన సమయంలో రాజ్యాంగ పీఠిక పఠనం చేయించారు. విద్యార్థులందరికీ రాజ్యాంగం గురించి వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు, డ్రాయింగ్ అండ్ క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా రాజ్యాంగం అనే అక్షరాలుగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రచన కర్తలైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్, జవహర్లాల్ నెహ్రూ మొదలైన రాజ్యాంగ సభ సభ్యులందరికి నివాళు లర్పించి వారి ఘనతను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్, పిఆర్టీయూ వేల్పూర్ మండల ప్రధాన కార్యదర్శి సి.వి నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుంకేట రవి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్, ఈజీఎస్ ఎపిఓ విద్యానంద్, స్థానిక పంచాయతీ కార్యదర్శి గంగా జమున, కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, ఊట్నూరి ప్రదీప్, సుంకేట శ్రీనివాస్, నరసయ్య, అజారోద్దీన్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్ని:భారత రాజ్యాంగం లేకపోతే పేదోడికి బతుకు లేదని, అలాంటి గొప్ప రాజ్యాంగాన్ని పాలకులు మార్చాలని కుట్రలు పన్నితే దేశ పౌరులు తగిన బుద్ధి చెబుతారని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం చందూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని రాజ్యాంగ పీఠిక చదువుతూ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, భూమయ్య, సాయిలు, సుశీల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వర్నిమండల కేంద్రంలోని ఎస్ఎన్ పురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేశ్వర్, తహసీల్దార్ సాయిలు భారత రాజ్యాంగ రచయిత బాబా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంచాయతీ కార్మికులకు రాజ్యాంగ పీఠిక గురించి వివరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సాయిలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ :పట్టణ కోర్ట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యంగ దినోత్సవాన్ని మంగళవారం న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. 75 వ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెడ్డు నర్సయ్య రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పోడేటి శంకర్ న్యాయ వాదులు జక్కుల శ్రీధర్, రామ కృష్ణ, కిష్టయ్య, సుభాష్, గంగాధర్, విజయ లక్ష్మి, అనిల్, చరణ్, సుకేష్, గణేష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర : భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు కల్పించిందని ఎంపిడిఓ అన్నారు. పోచంపాడ్ ఉన్నత పాఠశాలలో , చాకిర్యల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి.ముత్యం రెడ్డి, సెక్రటరీ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్:ముప్కాల్ గ్రామపరిరక్షణ సమితి సభ్యులు, ఆయా గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ సంఘం నాయకులు రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, కార్యదర్శి సంజీవ్ థామస్, సభ్యులు నాయకుడు సంతోష్, కట్ట మహేష్, గద్దల గంగారాం, కందుల శంకర్ పాల్గొన్నారు.

రెంజల్ : భారత రాజ్యాంగం ప్రవేశపెట్టి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ర్యాలీగా వెళ్లి ప్రతిజ్ఞ చేశారు. మనందరికీ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కల్పించిన భారత రాజ్యాంగ రచన కమిటీ అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని వారు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, యువత గైని సాయిలు, సిద్ధ ప్రభాకర్, జక్కుల సంతోష్, పోతరాజు ప్రభాకర్, ఎల్ కృష్ణ, లైబ్రరీ సాయిలు, పోశెట్టి పాల్గొన్నారు.

కోటగిరి:మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసిన అనంతరం అంబేద్కర్ సంఘ అధ్యక్షులు బ్యాగరి రాములు మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం అధికారులు, నాయకులు పరిపాలన సాగిస్తున్నారన్నారు మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ సంఘ అధ్యక్షులు రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో బాన్సువాడ మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింలు, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ అధ్యక్షులు మైసయ్య, సాయిలు, గంగారం, మాల మహానాడు ఉపాధ్యక్షులు, కొత్తబాద్ మాజీ సర్పంచ్ సాయిలు, మాల మహానాడు మండల ఉపాధ్యక్షులు సైదయ్య, జంగం సాయిలు, పాల గంగారం, సత్యనారాయణ, నిమ్మల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:రాజ్యాంగం ఆమోదించబడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని ప్రజలందరు గౌరవించాలని, జాతీయ సమైక్యతను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఉపన్యాసం, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోతంగల్ :మండలంలోని ఎంపిపి పాఠశాలలో విద్యార్థులతో కలసి, ఎండిఎం, పోతంగల్ ఎంఇఓ శంకర్, ఎంపిఓ కోటగిరి, తదితరులు సహపంక్తి భోజనం చేశారు.

ఆర్మూర్ : ఆర్మూర్ పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకను నిర్వహించారు. విద్యార్థులు. ఉపాధ్యాయులు సామూహిక రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాజ్యాంగానికి సంబంధించిన వ్యాసరచన పోటీని నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం గురించి విద్యార్థులకు వివరించారు. భారత రాజ్యాంగం విలువలు విద్యార్థులకు తెలిపారు. ప్రభుత్వం శరీరం వంటిది అయితే రాజ్యాంగం ఆత్మ వంటిదని రాజ్యాంగం అతిపెద్ద లిఖిత గ్రంథం అని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించడానికి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టిందని తెలిపారు. 1949 నవంబర్ 26న దీనిని ఆమోదించారని 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిందని విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ దాసు మాట్లాడుతూ.. 2015 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం నవంబర్ 26న ప్రతి పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వ ఆమోదించిందని తెలిపారు.



కమ్మర్‌పల్లిలో..



ఆర్మూర్: బార్అసోసియేషన్ అద్వర్యంలో..



ఆర్మూర్: లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో..

కంజర సాంఘిక సంక్షేమ కళాశాలను తనిఖీ తీసిన అడిషనల్ కలెక్టర్



పరిసరాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర గ్రామంలోగల సాంఘిక సంక్షేమ కళాశాలను మంగళవారం అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, డార్మెటరీ రూమ్, కళాశాల ఆవరణ క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని చూసి సంతృప్తి చెందారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాముల్ నాయక్, ఎంపీఓ కిరణ్, సివిల్ సప్లై అధికారులు, ముదక్పల్లి పిహెచ్‌సి డాక్టర్ ప్రత్యూష, కళాశాల ప్రిన్సిపాల్ విజయలలిత పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ- రెంజల్

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని ఆయన పరిశీలించారు. స్టోర్ రూమ్ లోని వస్తువులను పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, డిజిటల్ బోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలను చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, సిబ్బంది సుజాత, స్వప్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుళ్లిన కూరగాయలు, నాసిరకం వంట సామాన్లు వాడొద్దు

- వైద్యాధికారి డాక్టర్ ప్రణవ
- కేజిబివి పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వైద్యాధికారి ప్రణవ

నవతెలంగాణ - మెండోర

మెండోర పిహెచ్‌సి వైద్య అధికారి డాక్టర్ ప్రణవ కెజిబివి పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వంట సామాన్లు, శానిటేషన్‌ను పరిశీలించారు. మెనూ అమలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుళ్లిన కూరగాయలు, నాసిరకం వంట సామాన్లు వాడొద్దని పాఠశాల అధికారులకు, సిబ్బందికి హెచ్చరించారు. విద్యార్థినిలు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని కోరారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థినులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వారితో పాటు సూపర్వైజర్ భీమన్న, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎన్ఎస్‌యుఐ నేషనల్ అధ్యక్షుడికి స్వాగతం

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, ఎన్ఎస్ఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబుట్ట వేణు రాజ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాహుల్ యాదవ్, వాళ్లు కలిసి ఎన్ఎస్‌యు ఐ నేషనల్ అధ్యక్షుడు వరుణ్ చౌదరికి ఘన స్వాగతం పలికారు. మంగళవారం రాష్ట్రంలో నిర్వహించిన ఎన్ఎస్‌యుఐ సంవిధాన్ దివస్ సభకు, రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరికి ఎడవల్లి వెంకటస్వామి స్టేట్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా వేణు రాజ్ బట్టు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు పోల్కం శివ, అరవింద్, బాసర్ మండల ప్రెసిడెంట్, గంగ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువకునిపై ఫోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుని పై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్ మంగళవారం తెలిపారుబా. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం కాలనీకి చెందిన ఎజాజ్ అనే యువకుడు బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని, బాలిక తల్లిదండ్రులు ఐదో టౌన్లో ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.